

# మానెగానుగ

"సమువృత్తంగళ్" మళయాళీ మూలం: బాలకృష్ణన్ మంగాడ్

స్వేచ్ఛానువాదం: పి. సత్యవతి



అల్లంత దూరాన ఎత్తుగా పెరిగిన చెట్ల పై నుంచీ ముక్కలు ముక్కలుగా కనిపిస్తున్న నీలాకాశాన్ని చూసింది కున్హని. క్రమంగా ఆకాశంలో నీలం రంగు కరిగిపోతోంది. ఆవరణలో పొత్తుగా పెరిగిన అరటి చెట్లు గాలికి ఊగుతూ "ఎందుకలా మొండిగా కిటికీ దగ్గర నిలబడతావ్" అని అడుగుతున్నట్లున్నాయి. ఆ మాటలు పెడచెవిన పెడూతూ, కదులుతున్న వెలుగు నీడలకేసి చూస్తూవుండిపోయింది. క్రమంగా వెలుగుని చీకటి మింగేసింది. చుట్టూ చీకటి తప్ప మరేం లేదు.

అతను ఇంకా ఇంటికి వచ్చినట్లు లేదు. బహుశా వచ్చి లోపల గదిలో వున్నాడేమో!

కున్హనికి గతమంతా ఒక్కసారి కళ్ళ ముందు కదిలింది. కొంతకాలంగా వణియన్ చాల అశాంతిగా కనిపిస్తున్నాడు. అతని మొహంలో చురుకుదనము సంతోషము మాయమైపోయి, నీడలు పరుచుకుంటున్నాయి.

బీడీ పై బీడీ కాలుస్తున్నాడు.

కున్హని గుండెలో గుబులుగా వున్నది.

అతను మరో బీడీ చేతిలోకి తీసుకున్నాడు. అతని చెయ్యి పట్టుకొని, అది వెలిగించనీయకుండా ఆపింది. స్పర్శ తగిలితేనే గానీ, ఆమె ఉనికిని, గుర్తించలేదతను. "నాతో చెప్పకూడదా! నీ బాధేమిటో! అంది కున్హని. ఆమె చెయ్యి విడిపించుకుని బీడీ వెలిగించుకుని, "ఈ జీవితానికి అర్థం లేదు కున్హనీ -" అన్నాడు. "ఎందుకలా అంటున్నావు? నాకలా అనిపించడంలేదు." అన్నదామె.

"ఈ గానుగ ఇంకొన్నాళ్ళు మూలపడితే నీకూ అలాగే అనిపిస్తుంది."

ఆవరణలో కొబ్బరాకుల షెడ్ క్రింద అనాథవలె పడివున్న నూనె గానుగ కేసి చూసింది కున్హని. అందులో కొబ్బరిచిప్పలు వేయడం, నూనె తియ్యడం కేవలం ఒక జ్ఞాపకంగా మారింది, రాత్రనక, పగలనక గానుగ చుట్టూ ప్రదక్షణలు చేసే ఎద్దు వున్నట్లుండి కుప్పకూలి కళ్ళుమూయడంతో! దాని మువ్వల సవ్వడితోనే తమ జీవితాల్లో సంతోషమూ నిలిచి పోయినట్లయింది. ఆ జీవి మరణానికి మౌనంగా రోదిస్తున్నట్లు పడివుంది గానుగ.

"ఇంక ఈ గానుగపని చాలు! ఇంకో పని చూసుకు బ్రతుకుదాం; నేను రాళ్ళు కొట్టగలను అంటూ కాలిపోయిన బీడిముక్కని అవతల గిరాటు పెట్టాడు వణియన్. అందులోనుంచీ రెండు నిప్పురవ్వలు ఎగిరి వచ్చి ఆరిపోయాయి.

కున్హని అతని మొహంలోకి నిశితంగా చూసి, వణికే స్వరంతో, "అలా ఎందుకనుకుంటున్నావు?" అని అడిగింది.

"తొండాచన్ స్వామే నాలో ఇలాంటి ఆలోచనలు కలుగజేస్తున్నాడు. ఆ స్వామి పలుకులు నాకు వినిపించాయి."

"స్వామి నీకు కలలో దర్శనం యిచ్చాడా?"

"కలలోనే కాదు మెలకువలో కూడా నాకాయన పిలుపు వినపడుతూ వుంది."

"తొండాచన్ స్వామికి మన మీద కోపం వచ్చిందేమో!"

అంది కున్హని నిట్టూర్చి

"ఏమో! ఎవరికి తెలుసు!"

తొండాచన్ స్వామి తిరునాళ్లలో జరిగిన నృత్యాలు, పూజలు, హడావుడి, ఆ స్వామికి తాము చేసిన అలంకారం అన్నీ గుర్తొచ్చాయి కున్హనికి. అప్పటినుంచీ ఏదో అవ్యక్త వేదన తనని పీడిస్తూనే వుంది. గొంతులో ఏదో అడ్డుపడ్డట్లే వుంది.

"ఆ స్వామి కోపమే తన భర్త శక్తి యుక్తులన్నింటినీ హరించిందా!" అన్న ఆలోచన ఒక్క క్షణం పాటు ఆమె మనస్సులో మెదిలింది. తొండాచన్ స్వామికి మనం సుఖంగా బ్రతకడం యిష్టం లేదేమో!" అన్నాడు వణియన్ విరక్తిగా.

అతని పలుకుల్లోని చేదూ, విషాదం ఆమెని కదిలించగా, "అలా అనకు - " అని అతని పెదవులకు తన చేతిని అడ్డం పెట్టింది.

కున్హనికి అర్థం అయింది. నిజంగానే ఇతను చాలా మారిపోయాడు. అతని కళ్ళు మబ్బులు ముసిరిన ఆకాశంలా వున్నాయి. ఏవో వూహలు అతన్ని భయపెడుతున్నట్లున్నాయి.

ఎక్కడో ఇంతకాలం దాక్కున్న నీడ యిప్పుడు తమ ముందు నుంచి నడిచి వెడుతున్నట్లు అనిపించింది కున్హనికి.

ఆ వెంటనే, మరొక భయంకరమైన నీడలా, చెట్లదగ్గర ప్రత్యక్షమయ్యేడు ఉక్కరన్ నాయర్. అతడు గొప్పింటి ఆసామి.

తాంబూలం నమిలి చెట్లలో ఉమ్మేస్తు, "ఏయ్! వణియా!" అని బిగ్గరగా కేకపెట్టేడు. భయం భయంగా అతన్ని సమీపించేడు వణియన్.

"నీకు పంపిన బస్తాడు కొబ్బరి చిప్పలు ఎక్కడ?" అని హుంకరించేడు.

షెడ్‌లో మూల పడివున్న కొబ్బరిచిప్పల బస్తాకేసి చూపించేడు వణియన్.

"అవి నీ అత్తకి బహుమానంగా పంపాననుకుంటున్నావా?" అని ఎకసెక్కంగా అడిగేడు ఉక్కరన్ నాయర్.

"మేం నూనె తియ్యడం మానేశాం అయ్యగారూ!" అన్నాడు వణియన్ వినయంగా; శక్తి కూడ గట్టుకుని.

నాయర్ కళ్ళు చిట్లించి, అతని మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ, "నీ వృత్తి నూనె తియ్యడం - నువ్వు చేసి తీరాల్సిందే - మానేశే హక్కు నీకు లేదు - అలామానడానికి వీల్లేదు - " అన్నాడు.

"గానుగ తిప్పే ఎద్దు చచ్చిపోయిందయ్యా!" అన్నాడు వణియన్.

"అయితే ఏమిటోయ్! నీ పెళ్ళాం వుందిగా - దుక్కలా గానుగ కొయ్య దాని మెడకి తగిలించు -" అన్నాడు నాయర్, మరోసారి ఉమ్మేస్తూ.

ఉలిక్కిపడి చూసింది కున్హని.

ఆమె నోరుతెరిచి ఏదో అనబోయేలోగానే, గానుగ కొయ్యతాలుకు తాడు ఆమె మెడకి తగిలించేడు నాయర్. "కానీ - గానుగ సాగనీ!" అని ఆజ్ఞాపించేడు. మతిపోయిన వానిలా చూస్తూ నిలబడిన వణియన్ శక్తి కూడ గట్టుకుని, కొబ్బరి చిప్పలు గానుగ తొట్టిలో నింపాడు. అక్కడ మేకుకు తగిలించి వున్న చెర్నాకోల అతని చేతిలో పెట్టాడునాయర్. అతను దాన్ని గాలిలో ఝుళిపించేడు కున్హని కదిలింది. మరోసారి చెర్నాకోలని గాలిలో ఝుళిపించాడు వణియన్. గానుగ కదిలింది - ఉక్కరన్ నాయర్ వికృతమైన నవ్వు తెరలు తెరలుగా ఆవరణంతా ఆక్రమించింది.

"నెప్పిగా వుందా కున్హనీ!" అని ఆమెని దగ్గరకు తీసుకుని తల నిమురుతూ అడిగేడు వణియన్, నాయర్ వెళ్ళిన తరువాత.

"లేదు -" అంది కున్హని.

"కోపం వచ్చిందా!"

"అబ్బే! అదేం లేదు."

"అయితే ఇంకొంచెం సేపు లాగగలవా!" అన్నాడు. రొప్పుతూ, సతమతమౌతూ మళ్ళీ లాగడం మొదలు పెట్టింది. చేతిలో చెర్నాకోలతో ఆమె వెనకే నడుస్తున్నాడు వణియన్.

"భగవంతుడా! తొండాచన్ స్వామీ -" అని లోలోపల రోదిస్తూ ప్రార్థించింది కున్హని.

బస్తాల కొద్దీ కొబ్బరి చిప్పలు వచ్చి పడుతున్నాయి. షెడ్ నిండిపోయింది.

"రేపటి నుంచీ, రాత్రివేళల గానుగ ఆడిద్దాం -" అన్నాడు వణియన్.

"ఎప్పుడైతేనేం! ఫరవాలేదు - " అంది కున్హని.

"రాత్రిపూట అయితేనే మంచిది. ఎవరూ చూడరు - నువ్వు మాత్రం మనిషివి కాదా ఏం?" అన్నాడు. ఈ మాటలకి కున్హని ఉలిక్కి పడింది. తను నిజంగానే 'మనిషి కాకుండా పోతోందేమో! తనలో మనుష్యేతర లక్షణాలు అంకురిస్తున్నాయేమోనని పించింది.

చీకటితో పాటు ఆమె భుజంమీద గానుగ బరువు పడుతోంది. రొప్పుతూ, తడబడుతూ, గుండ్రంగా తిరుగుతూ వుంటుంది కున్హని. తన అడుగుల్లోనే మళ్ళీ మళ్ళీ అడుగులు వేస్తూ వలయాలు చుడుతూ వుంటుంది. తన వైపు జాలిగా చూసి నవ్వుకునే నక్షత్రాల వంక చూడనట్లు నటిస్తుంది.

ఒకరోజు బరువులాగడం మరీ కష్టమైంది. కాళ్ళు తడబడ్డాయి. తూలి పడబోయింది. వెంటనే, ఆమె వెనకే నడుస్తూన్న వణియన్ చెర్నాకోలుతో ఆమె వీపుమీద ఒక్క దెబ్బ వేశేడు. బాధతో విలవిలలాడుతూ, కోపంతో, నిరసనతో వెనక్కి తిరిగి అతని వైపు చూసింది. అంతే! ఆమె వీపు మీద మరో దెబ్బ పడింది. భయకంపితురాలై ముందుకు పరిగెత్తింది. ఇంక వెనక్కి తిరగడానికి అతని వైపు చూడ్డానికి ధైర్యం చాలలేదు.

వేగం తగ్గినప్పుడల్లా చర్నాకోలుతో ఆమెవీపు మీద పొడిచేవాడు, ఒక్కొక్కసారి గానుగ కొయ్యకి చేరబడి బీడీ కాల్చేవాడు. అప్పుడు బరువు మరింత ఎక్కువయ్యేది.

ఒకరాత్రి కున్హని కుప్పలా కూలిపోయింది. అతను ఎన్ని సార్లు బెత్తం ఝుళిపించినా తనంతట తను లేవలేకపోయింది. కొట్టినా కిమ్మనలేదు. విసుగుపుట్టి ఆమెను లేవనెత్తి గదిలో మూల పడేశాడు వణియన్.

అలా కొన్ని రోజులు పడివుండిపోయింది కున్హని. ఇన్ని రోజులూ ఆమె లేస్తుందని ఓపిక పట్టేడు వణియన్ అతని ఓపిక నశించి పోయింది.

"నీ పనేమిటో మర్చిపోయావా?" అని గర్జించేడు ఒకరోజు

"ఇంక నా వలన ఏ పనీ కాదు-" అంది కున్హని.

"పోనీ లేచి ఒక్కసారి ప్రయత్నించి చూడరాదూ?"

"నా వల్లకాదు- నేను లేవలేను-"

"వచ్చే సంతరోజునే ఖామందుగారమ్మాయి పెళ్ళి- ఈలోగా వారు పంపిన కొబ్బరి చిప్పలన్నీ గానుగాడాలి- ఒక్కరోజు ఆలస్యం అయినా వాళ్ళు క్షమించరు-" అన్నాడు మళ్ళీ-

అతడికెలా చెప్పాలో అర్థంకాని కున్హని మౌనంగా వుండిపోయింది.

వణియన్ ఆలోచనలో పడ్డాడు. మరునాడుదయం అతను అదృశ్యమై పోయేడు. ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. రాత్రియినా అతని జాడలేదు. తొండాచన్ స్వామిని తలుచుకుంటూ వుండిపోయింది కున్హని. మెరిసే తెల్లని గడ్డంతో, మిలమిలలాడే కళ్ళతో తొండాచన్ స్వామి ఆమెకి దర్శనమిచ్చేడు.

"గానుగ తిప్పుతూ నూనె తీస్తు వుండడమే నీకు మోక్ష మార్గం కున్హనీ- ఈ ప్రదేశం అంతా నూనెతో నింపు- నూనె నదులు పారనీ- ఇంక అదొక్కటే నీ లక్ష్యంగా తలచుకో- దేన్ని గురించీ ఆలోచించకు-" అని సెలవిచ్చేడు.

కలత నిదురలోకి జారిన కున్హనికి కలల నిండా నూనె నదులు పొంగి ప్రవహించాయి.

తెల్ల వారడం కోసం, భర్త రావడం కోసం ఆత్రుతగా ఎదురు చూసింది.

రానే వచ్చాడు వణియన్ మరునాడు సాయంత్రానికి- ఒక్కడేకాదు- వెంట పుష్టిగా, బంతిలా, నూనెలా నిగనిగలాడే అమ్మాయిని తీసుకుని

> పసుపు బట్టల పెళ్ళికూతురు భుజం మీద గానుగ కొయ్యపడింది. చెర్నాకోలు గాలిలోకి లేచింది. తెల్లబోయి వెనక్కు చూసిన నవవధువు వీపు మీద మొదటి దెబ్బ పడింది. వెంటనే ఆమె కొయ్యలాగటం పరిగెత్తటం మొదలు పెట్టింది.

క్రొత్త బట్టలు కట్టుకుని, తలనిండా పూలు తురుముకుని, అత్యంత సుందరంగా ముస్తాబై, తనింట ఎడమ పాదం పైడు తొన్న ఆ అమ్మాయిని చూడగానే కున్హని మనస్సులో వెయ్యి సందేహాలు మొలిచాయి"ఈ పిల్లని నేను పెళ్ళి చేసుకొచ్చేను- నాకు మరో స్త్రీ అవసరం అని తోచింది. అసలు ఆ సలహా యిచ్చింది తొండాచ్చన్ స్వామే-" అన్నాడు వణియన్ ఆమె ఎదురుగా నిలబడి అత్యంత నిర్లక్ష్యంగా. కున్హని గుండె బరువైంది. అది చెరువు కాకుండ ఒక్క నిట్టూర్పుతో ఆ బరువు దించుకుంది.

"నేను రావడం నీకు యిబ్బంది కలిగించిందా! ఇలా రావడం తప్పా?" అని ఆ పిల్ల కున్హని భుజం మీద తల ఆనించి ఆమాయకంగా అడిగింది.

"లేదమ్మా- అదేం లేదు-" అని ఆమెని అక్కున చేర్చుకుంది కున్హని-

కున్హని కిటికీ దగ్గర్నుంచి బయటికి ఆకాశం క్రిందకి వచ్చింది- ఇప్పుడామెకి ఆకాశం క్రొత్తగా కనిపిస్తోంది.

"ఇప్పటికైనా కదలవేం? ఇక్కడ్నుంచీ!" అంటున్నాయి గాలికి ఊగే చెట్లు.

"ఇది నీ ఆకాశం! ఇవి నీ చెట్లు- ఇక్కడే నీ తొండాచన్ స్వామి కూడా వున్నాడు- ఎక్కడికి పోతావ్ నువ్వు-" అంది కున్హని మనసు.

చల్లని గాలి వీస్తోంది- లోపల గది తలుపులు వేసి వున్నాయి- అవును- ఇప్పుడు వణియన్ తోపాటు అతని క్రొత్త కళత్రం వుంది- తనెవరు యిప్పుడు? గాలికి ఊగిపోయే వృద్ధ వృక్షంలాంటి తను ఎవరికోసం ఎదురు చూస్తున్నట్లు.

వున్నట్లుండి ఆమె వెనుక అడుగుల సవ్వడివినిపించింది. వెనక్కి తిరిగి చూసింది కున్హని. లోపలి గది తలుపు తెరచుకుని వణియన్ బయటికి వస్తున్నాడు. అతని వెనకే అతని క్రొత్త భార్య కూడా వస్తున్నది. పెళ్ళికి వేసుకున్న క్రొత్త బట్టలు యింకా మార్చుకున్నట్లు లేదు పాపం? వణియన్ గానుగ దగ్గరకు వచ్చాడు. అతని చేతిలో చెర్నాకోలు వుంది. అతని వెనుక ఆమె కూడా గానుగ దగ్గరికి వచ్చింది.

కున్హని గుండె వేగంగా, మరింత వేగంగా కొట్టుకోసాగింది. ఆమె అలా చూస్తూండగానే పసుపు బట్టల పెళ్ళికూతురు భుజంమీద గానుగకొయ్య పడింది. చెర్నాకోలు గాలిలోకి లేచింది- తెల్లబోయి వెనక్కి తిరిగి చూసిన నవవధువు వీపు మీద మొదటి దెబ్బ పడింది- వెంటనే ఆమె కొయ్యలాగటం పరిగెత్తడం మొదలు పెట్టింది--